సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



ప్రజల్ని చైతన్యపర్చే రచనలు చేయాలి

నేటి కవులు, రచయితలు సమాజాన్ని మేల్కొలిపి చైతన్యపర్చే రచనలు చేయాలని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్ అందెశ్రీ అన్నారు.

- 8లో



విద్యుత్ సమస్యల్లేని పల్లెలే లక్ష్యంగా..


విద్యుత్ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ గ్రామాల దత్తత కార్యక్రమాన్ని చేపట్టింది.

- 8లో

గరిష్టం/కనిష్టం
43.5^0 /25.0^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. సాయంత్రం తర్వాత ఎండ నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.



న్యూస్‌రీల్

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మహబూబాబాద్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు సూచించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఫైర్ స్టేషన్ ఆవరణలో వర్క్‌షాపు, సెమినార్, అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగా ల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపాధ్యాయులు పలు కార్యక్రమాలు నిర్వహించాలన్నా రు. ప్రతి ఒక్కరికి అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగితే 101కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కృష్ణ, సిబ్బంది విశ్వనాథ్, సురేష్ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి



కొత్తగూడ: పొగుళ్లపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు దేశిడి శ్రీనివాసరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ చేపట్టాలని తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శి ఆలూరి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీకి వచ్చే ఎరువులను వ్యాపారులకు తరలించి కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపించారు. శ్రీనివాసరెడ్డి అక్రమాలపై విజిలెన్స్ అధికారులతో విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో రవి, జీవన్, లక్ష్మీనారాయణ, మునేష్, సారంగపాణి పాల్గొన్నారు.

భద్రకాళి హుండీ ఆదాయం రూ.62 వేలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలోని భద్రకాళీ అమ్మవారి హుండీని గురువారం లెక్కించగా రూ.62,242 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కవిత సమక్షంలో హుండీలోని కానుకలు లెక్కించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి



బయ్యారం: వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని డీఈఓ రామారావు సూచించారు. గురువారం బయ్యారంలోని బాలికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో విద్యార్థులు ఈతకు వెళ్లొద్దని, ఇంటి దగ్గరే ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వచ్చే విద్యాసంవత్సరం డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విజయకుమారి, టీచర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆమెదే పై చేయి..

ఉపాధి హామీ పనుల్లో మహిళలే అధికం

- 65 శాతం మగువల భాగస్వామ్యం
- పనులు చేస్తున్న పురుషులు 35 శాతమే
- కుటుంబ అవసరాలను తీరుస్తున్న స్త్రీలు



ఉపాధిహామీ పనిలో మహిళలు (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో చేపడుతున్న ఉపాధి హామీ పనుల్లో మహిళల భాగస్వామ్యమే అధికంగా ఉంది. పురుషులతో కంటే మగువలే ఎక్కువగా పనులకు హాజరవుతున్నారు. మూడింట రెండో వంతు మంది మహిళలే పనులు చేస్తూ వారి కుటుంబాలను ఆర్థిక పరిపుష్టి వైపు మళ్లిస్తున్నారని జిల్లా అధికారులు చెబుతున్నారు.

65శాతం మహిళలే..

జిల్లాలో 65శాతం మహిళలు, 35శాతం పురుషులు ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 2.15లక్షల జాబ్ కార్డులు ఉండగా, 4.56 లక్షల మంది నమోదై ఉన్నారు. ఇందులో 1.37లక్షల జాబ్ కార్డుల్లో నమోదైన 2.49లక్షల మంది మాత్రమే యాక్టివ్‌గా పనిచేసే వారు ఉన్నారు. వీరిలో గత ఏడాది 2,14,700 మంది కూలీలు రూ. 82.44కోట్ల విలువచేసే 52.17లక్షల పనిదినాలు పనిచేశారు. ఇందులో 1,30,300 (65శాతం)మంది మహిళలు, 84,400(35శాతం) మంది పురుషులు పనిచేయడం గమనార్హం.

అవసరాల కోసం..

పురుషులకు రోజువారి పని దొరుకుతుంది. కానీ మహిళలకు చేతినిండా పని ఉండదు. ఈ పరిస్థితుల్లో వారు ఉపాధి హామీ పనులను ఎంచుకుంటున్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా వచ్చిన డబ్బులను డ్వాక్రా గ్రూపుల్లో అప్పులు, కుటుంబ పోషణ, పంటల చిన్నచిన్న పెట్టుబడులకు వెచ్చిస్తున్నారు. దీంతో కుటుంబానికి కాస్త ఆర్థిక భరోసా కలుగుతోంది.

చిట్టీలు కడుతున్నాం..



ఉపాధి హామీ పనులకు క్రమం తప్పకుండా వెళ్తున్నాం. ప్రతీ సంవత్సరం వందరోజుల పని పూర్తి చేస్తున్నాం. వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధి పనులే అక్కరకు వస్తున్నాయి. చిట్టీలు కట్టడం, ఇంట్లో అవసరాలకోసం ఈ డబ్బులే ఉపయోగపడుతున్నాయి.

– కొర్ని వినోద, తిర్మలాపురం, కురవి

ఇంటి ఖర్చులకు వినియోగిస్తున్నాం..



ఉపాధి పనులు ఉంటే ఏ పనికి పోను. మా కార్డు మీద ఉన్నన్ని రోజులు పనికి పోతా. ఈ డబ్బులతోనే ఇంట్లో ఖర్చులు ఎల్లదీస్తా. పనులు దొరకని సమయంలో ఈ పనులు ఉంటాయి. కొలత ప్రకారం పనిచేసి ఇంటికి వస్తాం.

– జోగు సుజాత, అర్పనపల్లి, కేసముద్రం

ఎప్పుడైనా పనికి వెళ్తాం..



మేం చేపల బేరం చేస్తాం. మా భర్త చెరువుల్లో చేపలు తెచ్చేందుకు వెళ్తాడు. నేను ఉపాధి పనికి పోతా.. ఇంటికి వచ్చిన తర్వాత చేపలు అమ్ముతా. ఎప్పుడూ చేపలు బేరం సాగదు. అలాంటి సమయంలో ఉపాధి పనులు మాకు అక్కరకు వస్తున్నాయి.

– సుంకరి యాకమ్మ, నర్సింహులపేట

మహిళలే ఎక్కువ పాల్గొంటున్నారు



జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువ మంది ఉపాధి పనులకు వస్తున్నారు. వ్యవసాయ పనులు ఉన్నప్పుడు అటు వెళ్తారు. తర్వాత ఉపాధి పనికి వస్తారు. దీంతో జిల్లాలో మా టార్గెట్ పూర్తి చేయడమే కాకుండా లక్ష్యానికి మించి పనులు చేస్తున్నాం.

– సన్యాసయ్య, డీఆర్‌డీఓ

నిధులొచ్చాయ్..

మానుకోట ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలు

- మరమ్మతులు, పరికరాల కొనుగోలుకు నిధులు
- రూ.1.95కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం



ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రి

సాక్షి, మహబూబాబాద్: మానుకోట జనరల్ ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతోంది. 330 పడకల మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. కాగా మరిన్ని వసతుల కల్పనకు రాష్ట్ర వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి రూ.1.95కోట్లు విడుదల చేశారు.

మరమ్మతులు, మెరుగైన వసతులు..

మానుకోట ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన తర్వాత రోగుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రతీరోజు దాదాపు వెయ్యి మంది వరకు ఇన్, ఔట్ పేషెంట్లకు వైద్యం అందుతోంది. సరిపడా ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం అందించేందుకు పరికరాలు కరువయ్యాయి. ఈ మేరకు అధునాతన మిషన్లు, రోగులకు బెడ్స్, సహాయకులకు షెడ్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా పాత ఆస్పత్రికి కిటికీలు, తలుపులు, టాయిలెట్స్ సక్రమంగాలేవు. కాగా విడుదలైన నిధులు వెచ్చించి పైపనులు చేపట్టనున్నారు.

పట్టుబట్టి నిధులు తెచ్చి..

అధ్వానంగా ఉన్న ఆస్పత్రి ఇప్పుడిప్పుడే మెరుగులు దిద్దుకుంటుంది. మెడికల్ కళాశాల పరిశీలనకు వచ్చిన మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు జిల్లా ఆస్పత్రి పరిస్థితిని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, ఎంపీ మాలోత్ కవిత వివరించారు. అందేవిధంగా మంత్రి సత్యవతి రాథోడ్ పలుమార్లు మంత్రి హరీశ్‌రావును కలిసి ఆస్పత్రికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది ప్రభుత్వ ఆస్పత్రుల మరమ్మతులు, పరికరాల కొనుగోలు కోసం రూ.7.43కోట్లు మంజూరు చేశారు. ఇందులో మహబూబాబాద్ ఆస్పత్రికి రూ.1.95కోట్లు కేటాయించారు. కాగా ఆస్పత్రి అభివృద్ధికి అడుగగానే నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, డీసీహెచ్ వెంకట్రాములు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కుటుంబానికి కలెక్టర్ పరామర్శ



ఫరీదొద్దిన్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం తెలుపుతున్న కలెక్టర్ శశాంక

కేసముద్రం: జిల్లాలోని కేసముద్రం తహసీల్దార్ ఫరీదొద్దిన్ గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈమేరకు గురువారం హనుమకొండలో నివాసం ఉంటున్న మృతుడు తహసీల్దార్ ఫరీదొద్దిన్ కుటుంబాన్ని కలెక్టర్ శశాంక పరామర్శించి, మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. అదే విధంగా ఆర్డీఓ కొమురయ్య, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, కేసముద్రంస్టేషన్ సర్పంచ్ బట్టు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీశ్ నాయక్, బానోత్ శంకర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, డీలర్లు, తహసీల్దార్ మృతదేహంపై పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.

సీఎం కేసీఆర్‌తోనే అన్ని విధాలా అభివృద్ధి





మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, మూడోసారి కూడా ఆయనే ముఖ్యమంత్రి అవుతారని మంత్రి సత్యవతిరాథోడ్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో గురువారం బీఆర్ఎస్ పార్టీ మానుకోట పట్టణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, వేరే పార్టీ నుంచి పోటీ చేయాలంటేనే భయపడాలని, పోటీ చేసినా డిపాజిట్ కూడా దక్కని పరిస్థితి ఉందన్నారు. సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించారని, ఆ పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారుతాయన్నారు. వచ్చే నెలలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ప్రజల కోసం పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. తమ మధ్య ఎలాంటి విభేదాలు, గ్రూపులు లేవని, కలిసికట్టుగా పని చేస్తున్నామన్నారు. మానుకోట గడ్డపై మూడోసారి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జ్ సతీష్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, జెడ్పీటీసీ ప్రియాంక, ఏఎంసీ వైస్ చెర్మన్ రాజశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, పార్టీ నాయకులు మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, కెఎస్ఎన్‌రెడ్డి, చిట్యాల జనార్దన్, ముత్యం వెంకన్న, గద్దె రవి, గోగుల రాజు, అశోక్, మహబూబ్‌పాషా, శంకర్, కిరణ్, గిరిధర్ గుప్తా, లింగుబాబు, గొడుగు శ్రీనివాస్, ప్రభాకర్, రావిష్, యాకయ్య కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

మహబూబాబాద్ రూరల్: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మహబూబియా మసీద్‌లో గురువారం రాత్రి ముస్లిం సోదరులకు ఎస్పీ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకునేలా పోలీసుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, సీఐలు సతీష్, రమేష్, యాసిన్, ఆర్ఐలు లాల్‌బాబు, పూర్ణచందర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్యం కాపాడుకోవాలి

వేసవికాలం శరీరంలో నీటి శాతం బ్యాలన్స్ చేసుకుంటేనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్పీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, ఇతర ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, రూరల్ సీఐ రమేష్, ఎస్సై రాంచరణ్, ఫిర్యాదురారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాహం.. దాహం

మానుకోటలో తాగునీటికి తండ్లాట

- పూర్తి కాని మిషన్ భగీరథ పనులు
- పలు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు



పాత బజార్‌లో వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలోని గల్లీలో ట్యాంకర్‌తో నీటి సరఫరా



మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు (ఫైల్)

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గతంలో మున్నేరు వాగు నీటిపైనే ఆధాపడేది. ప్రతీ వేసవిలో నీటి కష్టాలు ఎక్కువగా ఉండేది. కాగా మిషన్ భగీరథ పథకం ద్వారా చాలా వరకు నీటి సమస్య తీరినప్పటికీ.. పనులు పూర్తికాని కాలనీల్లో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అవి సరిపోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో 36 వార్డులు..

మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులు ఉన్నాయి. 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 2,5000 పైగా గృహాలు ఉండగా సుమారు 10,000 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తి కాగా.. గ్యాస్‌గోదాం దగ్గర నుంచి రైల్వే ట్రాక్‌కింద పైప్‌లైన్ పనులు, కంకరబోడ్‌లో మెయిన్ రోడ్డు వద్ద పనులు మిగిలాయి. అయితే కంకరబోడ్‌లో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే కొంతమేరకు ఇన్‌ట్రా పనులు మిగిలిపోయాయి. పనులన్నీ పూర్తయితే తాగునీటి సమస్య చాలా వరకు తీరే అవకాశం ఉంది.

ఒక్క ట్యాంక్ మాత్రమే పూర్తి..

పట్టణంలో పాత ట్యాంక్‌లతో పాటు మిషన్ భగీరథ పథకం కింద నాలుగు ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. అయితే వీటిలో ఒకటి మాత్రమే పూర్తయింది. గాయత్రి గుట్టపై నిర్మిస్తున్న ట్యాంక్ పనులు 75శాతం, కంకరబోడ్ గుట్టపై నిర్మిస్తున్న ట్యాంక్ పనులు 75 శాతం, అర్బన్ సంప్ వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. కాగా నర్సంపేట రోడ్డులోని పెట్రోలు బంక్ వెనుక నిర్మించిన ట్యాంక్ మాత్రమే పూర్తయినట్లు మున్సిపల్ ఏఈ సురేష్ తెలిపారు. పూర్తయిన ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. అవి సరిపోవడం లేదు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో ముందుకు..

వేసవికాలం ప్రారంభం కాక ముందే కలెక్టర్ శశాంక పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షలు నిర్వహించారు. సంబంధిత అధికారులు మున్సిపాలిటీల్లో పర్యటించి నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కాగా అధికారులు, సిబ్బంది వార్డులలో పర్యటించి మున్సిపాలిటీ బావులను శుభ్రం చేయించడంతో పాటు పూడికతీత పనులు, బోర్ల మరమ్మతులు చేయించారు. నాలుగు వాటర్ ట్యాంకర్ల ద్వారా సమస్య ఉన్న ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నాలుగు ట్యాంకర్ల నీరు సరిపోవడం లేదు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి.

ఆందోళన బాట..

సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో పలు కాలనీవాసులు నీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తున్నారు. ధర్మన్న కాలనీలో ప్రతి సంవత్సరం వేసవిలో నీటి సమస్య తీవ్రతరం అవుతుందని సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో జ్యోతిబస్ నగర్ కాలనీ, బీటీఆర్ నగర్ కాలనీతో పాటు పలు కాలనీల్లో నీటి సమస్య ఉందని ఆందోళన చేశారు. ప్రతీరోజు పలు కాలనీల ప్రజలు మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి నీటి సమస్య పరిష్కరించాలని వినతులు ఇస్తున్నారు. వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలోని గల్లీలో నెల రోజులుగా నీటి సరఫరా లేదు. పాత పైప్‌లైన్ తొలగించి మిషన్‌భగీరథ పనులు చేస్తున్నారు.

నెల రోజుల్లో పనులు పూర్తి

మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ పనులు కేవలం కంకరబోడ్, గ్యాస్‌గోదాం వద్ద మాత్రమే మిగిలాయి. అన్ని పనులు నెల రోజుల్లో పూర్తి అవుతాయి. ఆలోగా తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. ఆ ప్రాంతాల్లో బావులు ఉంటే మరమ్మతులు చేసి విద్యుత్ మోటార్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తున్నాం.

– సురేష్, మున్సిపల్ ఏఈ

జీపీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్: వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ అభిలాషఅభినవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో అదనపు కలెక్టర్ అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లల ఎత్తు, బరువు లెక్కించి నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, వైకుంఠధామాలకు తప్పనిసరిగా మిషన్‌భగీరథ కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రమాదేవి, డీడబ్ల్యూఓ వరలక్ష్మి, డీపీఓ ధన్‌సింగ్, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ ఎజెండా ప్రమాదకరం

దంతాలపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదకరమని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సక్రు అన్నారు. గురువారం మండలంలోని రేక్యాతండాలో సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. దేశంలో నిరుద్యోగం తీవ్రంగా ఉందని, దానిని తగ్గించే చర్యలు చేపట్టలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బహిరంగంగానే మహి ళలపై అఘాయిత్యాలు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందన్నారు. అనంతరం సంఘం దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల ఉమ్మడి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిమ్మల కమలాకర్,ప్రధాన కార్యదర్శిగా సోమన్న, సభ్యులుగా అనిల్, యాకసాయిలు, సర్వన్, మల్లయ్య, శ్రీనును ఎన్నుకున్నారు.

పోలీసుల అదుపులో యువకులు?

మహబూబాబాద్ రూరల్: ఐపీఎల్ సీజన్ మొదలు కాగానే.. జిల్లాలో కొంత మంది యువకులు బెట్టింగ్ ప్రారంభించారు. పాతవారితో పాటు కొత్తవారు, అనుమానిత వ్యక్తులను క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్న సుమారు 15మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని కాపాడేందుకు నాయకులు, నేతలు, అధికారులు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వదిలేసినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

పాల సేకరణ ధరల పెంపు

- నేటి నుంచి అమలు
- ముల్కనూరు డెయిరీ జీఎం భాస్కర్‌రెడ్డి

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మహిళా డెయిరీ పాల సేకరణ ధరలు లీటర్‌కు రూ.4 పెంచుతున్నట్లు, ఈ ధరలు శుక్రవారం నుంచి అమలవుతాయని డెయిరీ జీఎం మార్పాటి భాస్కర్‌రెడ్డి, మహిళా డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు లీటర్‌ పాలకు రూ.40.50 ధర ఉండగా.. పెంచిన ధరతో లీటర్‌కు రూ.44.50 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ధరల పెంపుతో 20 వేల మంది మహిళా రైతులకు లబ్ధి చేకూరనుందని వారు వెల్లడించారు. పాల సేకరణ ధరల పెంపుతో ప్రతీనెల రూ.50 లక్షల అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. దాణా, ఇతర ముడి సరుకుల ధరలు పెరగడంతో రైతులపై భారం పడకుండా.. ధరలు పెంచుతున్నట్లు తెలిపారు. 50 కిలోల దాణా బస్తాకు రూ.100 రాయితీ, పశు గ్రాస విత్తనాలకు 50 శాతం రాయితీ. కృత్రిమ గర్భాధారణకు 100 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. కాగా.. మిశ్రమ దాణా ప్యాకెట్‌ ఉచితంగా అందించనున్నట్లు భాస్కర్‌రెడ్డి, ధనశ్రీ తెలిపారు.

పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

మడికొండ: బుధవారం కూతురును చంపి ఆత్మహత్య చేసుకున్న ఈరబోయిన అనిత(26) కూతురు శివసాన్విత (4) పోస్టుమార్టమ్‌ అనంతరం గురువారం కాజీపేట మండలం తరాలపల్లిలో పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మడికొండ పోలీసులు ఇన్‌స్పెక్టర్‌ వేణు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించగా.. కుటుంబ సభ్యులు అంత్యక్రియలను ముగించారు.


న్యాయవాది హత్య కేసులో ప్రత్యేక పీపీగా సత్యనారాయణ



వరంగల్‌ లీగల్‌ : దారుణ హత్యకు గురైన న్యాయవాది మూలగుండ్ల మల్లారెడ్డి కేసులో ప్రత్యేక పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా మోకాళ్ల సత్యనారాయణగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ జితేందర్‌ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని పందికుంట గ్రామం వద్ద జాతీయ రహదారిపై కిరాయి హంతకులు గతేడాది ఆగస్టు 1న అతికిరాతంగా న్యాయవాది మల్లారెడ్డిని హత్య చేసిన విషయం తెలిసిందే. ములుగు జిల్లా కోర్టులో విచారణకు రానున్న ఈకేసులో ప్రత్యేక పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సత్యనారాయణ గౌడ్‌ను నియమించింది.

విద్యుత్‌ సమస్యల్లేని పల్లెలే లక్ష్యంగా..

- గ్రామాల్ని దత్తత తీసుకున్న అధికారులు
- టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌లో కీలక నిర్ణయం
- ఎన్పీడీసీఎల్‌ పరిధిలో 622 గ్రామాల దత్తత



హన్మకొండ: విద్యుత్‌ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ గ్రామాల దత్తత కార్యక్రమాన్ని చేపట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం మొదటిసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాస్థాయి అధికారి నుంచి సెక్షన్‌ స్థాయి అధికారి వరకు ప్రతీ ఒక్క అధికారి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవడం వల్ల గ్రామాల్లో విద్యుత్‌ సమస్యలనేవే లేకుండా చేయాలని టీఎస్‌ఎన్పీడీసీఎల్‌ ఆలోచించింది. ఈవిధానం విజయవంతమైతే ముందు అన్ని గ్రామాల్లో అమలు చేయాలని సంస్థ భావిస్తోంది. ఏళ్లుగా గ్రామాల్లో విద్యుత్‌ సమస్యల పరిష్కారంలో జాప్యం జరగడం, సంస్థకు నష్టాలు కలగడం వంటివి తరచూ జరుగుతుండడంతో వాటన్నింటికీ పరిష్కారం దిశగా టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు ఆలోచించి కార్యరూపంలోకి తీసుకొచ్చారు. 32 పట్టణాలు, 5,827 గ్రామాలు, 10.046 శివారు గ్రామాలు, 8,732 దళితవాడలు, 4,506 బలహీనవర్గాల కాలనీల్లో విద్యుద్దీకరణ చేశారు. సంస్థ పరిధిలోని 16 జిల్లాల్లో 622 గ్రామాలను అధికారులు దత్తత తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో 30 రకాల విద్యుత్‌ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం

దత్తత తీసుకున్న గ్రామాల్లో మొదటగా సంస్థకు ఆర్థిక భారం పడని సమస్యలను పరిష్కరిస్తారు. తర్వాత తక్కువ ఖర్చులతో పరిష్కరించే పనులు, ఆతర్వాత ఖర్చుతో కూడుకున్న పనులను పూర్తి చేస్తారు. కాగా.. దత్తత తీసుకున్న గ్రామాల్లో అధికారులు ఇప్పటికే సమస్యలు గుర్తించారు. ఖర్చుతో కూడుకున్న సమస్యలకు సంబంధించిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆర్థిక భారం పడని పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

గుర్తించిన సమస్యలివే..

వేలాడుతున్న విద్యుత్‌ లైన్లు 6,587 గుర్తించి ఇప్పటి వరకు 4,218 సరి చేశారు. వంగిన స్తంభాలు 4,110, పరిష్కారం చూపినవి 2,055. తుప్పు పట్టిన స్తంభాలు 6,075, పరిష్కరించినవి 151, మధ్య స్తంభాలు గుర్తించినవి 17,614, పరిష్కరించినవి 425. రోడ్‌ క్రాసింగ్‌ గుర్తించినవి 2,681, పరిష్కరించినవి 117. స్టే వైర్ల సమస్యలు 6,058, పరిష్కరించినవి 298. ఓవర్‌ లోడ్‌ డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్ల గుర్తింపు 2,281. ఏర్పాటు చేసినవి 102. ఎత్తు తక్కువగా ఉన్న, శిథిలావస్థకు చేరుకున్న డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ గద్దెలు గుర్తించినవి 1130, పరిష్కరించినవి 16. ఏబీ స్విచ్‌ల సమస్యలు 1218, పరిష్కరించినవి 95. ఎర్తింగ్‌ సమస్యలు 4918, పరిష్కరించినవి 238. వీటితో పాటు రైతులకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం, విద్యుత్‌ చౌర్యం జరుగుతున్న సర్వీస్‌లు, బిల్‌ స్టాఫ్‌, కాలిపోయిన మీటర్‌ వంటి సమస్యల్ని గుర్తించి వాటిని పరిష్కరించనున్నారు.



భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో లూజ్‌ లైన్లు బిగిస్తున్న సిబ్బంది

ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

హన్మకొండ: దత్తత గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని టీఎస్‌ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. గురువారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్‌ ప్రధాన కార్యాలయం నుంచి నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల ఎస్‌ఈలు, డీఈలు, ఎస్‌ఏలతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌ బి.వెంకటేశ్వరరావు, డైరెక్టర్‌ పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్‌, సదర్‌లాల్‌, రాజుచౌహాన్‌, మధుసూదన్‌, భీకంసింగ్‌, డీఈ (ఐటీ) అనిల్‌కుమార్‌, ఎస్‌ఈలు, డీఈలు, ఎస్‌ఏఓలు పాల్గొన్నారు.

సమస్యల్లేకుండా తీర్చిదిద్దేందుకు..



విద్యుత్‌ సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దత్తత గ్రామాల కార్యక్రమం తీసుకున్నాం. ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు అన్ని జిల్లాల్లో ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఇప్పటికే సమస్యలు గుర్తించారు. పనులు కొనసాగుతున్నాయి. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ అందించడంతో పాటు విద్యుత్‌ నష్టాలు తగ్గించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. మొదటి విడతలో తీసుకున్న దత్తత గ్రామాల్లో వచ్చే ఫలితాలను బట్టి మరింత విస్తృతం చేస్తాం.

- ఎ.గోపాల్‌రావు, ఎన్పీడీసీఎల్‌ సీఎండీ

వినియోగదారులు సంతోషపడుతున్నారు..



గ్రామాల్లో విద్యుత్‌ సమస్యల్లేకుండా చేస్తుండడంతో వినియోగదారులు సంతోషపడుతున్నారు. దత్తత గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. సమస్యలు పరిష్కరించడం ద్వారా విద్యుత్‌ అంతరాయాల్లేకుండా నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ సరఫరా వినియోగదారులకు అందుతుంది. గ్రామస్తుల నుంచి సహకారం అందుతోంది. ఓవర్‌ లోడ్‌ ట్రాన్స్‌ఫార్మర్ల గుర్తింపు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మధ్య స్తంభాలు పాతడం, వదులుగా ఉన్న లైన్ల బిగింపు వంటి పనులు చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వెంకటరమణ, ఎన్పీడీసీఎల్‌ ఎస్‌ఈ, హనుమకొండ

రైలులో బాలల అక్రమ రవాణా

- ఏడుగురు ఏజెంట్లు, 11 మంది బాలలను అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్‌ సిబ్బంది

కాశిబుగ్గ: కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 11 మంది బాలలతో పాటు వారిని తీసుకెళ్తున్న ఏడుగురు ఏజెంట్లను గురువారం అదుపులోకి తీసుకున్నట్లు వరంగల్‌ ఆర్పీఎఫ్‌ పోలీసులు తెలిపారు. ఆర్‌పీఎఫ్‌ వారి కథనం ప్రకారం.. భువనేశ్వర్‌ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌లో కొంత మంది ఒడిశా నుంచి సోలాపూర్‌లో కార్మికులుగా పని చేయించేందుకు బాలలను తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో ఆర్పీఎఫ్‌, సీడబ్ల్యూసీ, జీఆర్పీ సిబ్బంది ముందుగా ఖమ్మం వెళ్లి కోణార్క్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు ఎక్కి తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన 11 మంది బాలలను, వారిని తరలిస్తున్న ఏడుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకుని వరంగల్‌లో దిగారు. అనంతరం వారి పూర్తి వివరాలు సేకరించి బాలలను సీడబ్ల్యూసీ హోమ్‌ తరలించారు. ఏడుగురు ఏజెంట్లు సుశాంత్‌, బారి సత్తేశ్వర్‌, రజిత్‌దాస్‌, సంపూనాయక్‌, మితుల్‌నాయక్‌, ఉత్తమ్‌కుమార్‌, పిట్ట మాధవరావుపై బచపన్‌ బచావో ఆందోళన్‌ ప్రాజెక్ట్‌ ఆధికారి పోలేపాక నరేశ్‌ చేసిన ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఒకరి అరెస్ట్‌

వరంగల్‌ క్రైం: ఐపీఎల్‌ క్రికెట్‌ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌ దగ్గర బెట్టింగ్‌కు పాల్పడుతున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కాసా లక్ష్మణ్‌రావును అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి రూ.4,11,720 నగదు, రూ.45 వేలు విలువైన ల్యాప్‌టాప్‌, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు నిస్సార్‌పాషా, లవన్‌కుమార్‌, శరత్‌ ఉన్నారు.

పోలీసుల అదుపులో యువకులు?

మహబూబాబాద్‌ రూరల్‌: క్రికెట్‌ బెట్టింగ్‌ల్లో పాల్గొన్న సుమారు 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని కాపాడేందుకు నాయకులు, నేతలు, అధికారులు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వదిలేసినట్లు పుకార్లు వస్తున్నాయి.

ప్రజల్ని చైతన్యపర్చే రచనలు చేయాలి

- కవితా సంపుటాలను ఆవిష్కరించిన సుద్దాల అశోక్‌ తేజ, అందెశ్రీ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, సుద్దాల అశోక్‌ తేజ

జనగామ రూరల్‌: నేటి కవులు, రచయితలు సమాజాన్ని మేల్కొలిపి చైతన్యపర్చే రచనలు చేయాలని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, డాక్టర్‌ అందెశ్రీ అన్నారు. గురువారం జనగామలోని విజయ ఫంక్షన్‌ హాల్‌లో కొక్కొండ జగదీశ్వరి రచించిన 'నల్ల కలువలు', 'జనారణ్యంలో జింకలు' కవిత సంపుటాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల భిక్షపతి, జీవై.కృష్ణ, డాక్టర్‌ రాజమౌళి, అనిత, గిరి, వివిధ ప్రజాసంఘాల నాయకులు 100 మంది తదితరులు పాల్గొన్నారు.

ఒడవని వేదన

హన్మకొండ కల్చరల్‌ : ఇంద్రకుమార్‌ మేఘ్వాల్‌ హత్య, బిల్కిస్‌బానో, వాకపల్లి ఆదివాసీ మహిళల ఆత్యాచార బాధితులాంటి వారికి తీరని అన్యాయం జరిగి ఎప్పటికీ ఒడువని వేదన మిగిల్చిందని వరంగల్‌ జిల్లా ప్రముఖ నవల, కథా రచయిత పి.చంద్‌ అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద వరంగల్‌ రచయితల సంఘం 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరసం ప్రచురించిన బిల్కిస్‌బానో, ఇంద్రకుమార్‌ మేఘ్వాల్‌ల సంఘీభావ రచనలు 'నిరసన జ్వాలలు' పుస్తకావిష్కరణ జరిగింది. వరసం అధ్యక్షుడు నల్లెల్ల రాజయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.చంద్‌, అనుపమ మాసపత్రిక సంపాదకులు, జమాతే ఇస్లామిక్‌ హిందూ ఉమెన్స్‌ వింగ్‌ షెహనాజ్‌బేగం పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి దండ్రె రాజమౌళి వరసం 16 సంవత్సరాల కృషిని నివేదిక ద్వారా చదివి వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి, బాసిత్‌, కుమారస్వామి, మెట్టు రవీందర్‌, వంగాల సంపత్‌రెడ్డి, రమాదేవి, రామ్మూర్తి, శంకర్‌రావు, రాజేశ్వర్‌రావు, సంపత్‌కుమార్‌, పిట్ట సాంబయ్య, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



నిరసన జ్వాలలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్‌, షెహనాజ్‌బేగం

పుట్టిన రోజు తెల్లారే పరలోకాలకు..

- ఆర్టీసీ బస్సు చక్రాలకింద పడి విద్యార్థి మృతి
- భగ్గుమన్న కుటుంబీకులు, బంధువులు
- బస్సుల అద్దాలు ధ్వంసం..
- మిన్నంటిన రోదనలు



చరణ్‌(ఫైల్‌)

వరంగల్‌ చౌరస్తా: ఇటీవలే పదోతరగతి పరీక్షలు రాశాడు. స్నేహితులతో కలిసి పుట్టిన రోజు వేడుకల్ని ఘనంగా జరుపుకున్నాడు. సమ్మర్‌ హాలీడేస్‌ ఎంజాయ్‌ చేద్దామని ప్రణాళిక వేసుకున్నాడు. కానీ విధి వక్రీకరించింది. పుట్టిన రోజు మర్నాడే ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. గురువారం మధ్యాహ్నం వరంగల్‌ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు చక్రాల కిందపడి వరంగల్‌ కాశిబుగ్గ హరిజనవాడకు చెందిన చింత చరణ్‌ అలియాస్‌ సన్ని(17) మృతి చెందాడు. చరణ్‌ కాశిబుగ్గలోని నరేంద్రనగర్‌ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదో తరగతి చదివి.. ఇటీవలే వార్షిక పరీక్షలు రాశాడు. బుధవారం తన పుట్టిన రోజు వేడుకలను స్నేహితులతో కలిసి ఘనంగా జరుపుకున్నాడు. గురువారం తన స్నేహితున్ని బస్సెక్కించేందుకు మరికొంత మంది స్నేహితులతో కలిసి వరంగల్‌ బస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఈక్రమంలో బస్టాండ్‌ నుంచి బయటికి వెళ్లేందుకు చరణ్‌ ప్రయత్నిస్తుండగా.. ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉన్న ఆర్టీసీ బస్సు (టీఎస్‌ 21 జెడ్‌ 0031) ముందు నుంచి వెళ్తుండగా.. అదే సమయంలో నిజామాబాద్‌ డిపో-1 చెందిన టీఎస్‌ 16 యూఏ 6677 బస్సు పార్క్‌ చేసేందుకు డ్రైవర్‌ ఎలియాస్‌ రివర్స్‌ తీసుకుంటున్నాడు. చరణ్‌ రెండు బస్సుల మధ్య ఇరుక్కున్నాడు. అతడి మిత్రులు మాత్రం అప్పటికే మొదటి బస్సును దాటేశారు. చివరకు ఉన్న చరణ్‌ బస్సుల మధ్య ఇరుక్కొగా నిజామాబాద్‌ డిపోకు చెందిన బస్సు చక్రాల కింద పడి మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న చరణ్‌ కుటుంబీకులు, కాలనీవాసులు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు తరలి వచ్చారు. డ్రైవర్‌ నిర్లక్ష్యం వల్లే చరణ్‌ మృతి చెందాడని ఆగ్రహంతో ఐదు బస్సుల అద్దాలు పగులగొట్టారు. కంట్రోల్‌ రూమ్‌పై దాడి చేశారు. దీంతో బస్‌స్టేషన్‌ ఆవరణ ఉద్రిక్తంగా మారింది. ఇంతేజార్‌గంజ్‌ పోలీసులు రంగంలోకి దిగి.. ఆందోళనకారులను శాంతింపజేశారు. మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్‌ సీఐ మల్లేశ్‌ తెలిపారు. కుమారుడు రక్తపు మడుగులో పడి ఉండడంతో ఆ తల్లిదండ్రులు గుండెలు బాదుకుటూ ఏడ్చిన తీరు అందరినీ కలిచివేసింది. డ్రైవర్‌ ఫోన్‌ మాట్లాడుతూ.. బస్సును అజాగ్రత్తగా వెనక్కి తీస్తుండగా ప్రమాదం జరిగిందని.. చరణే ఫోన్‌ మాట్లాడుతూ.. రెండు బస్సుల మధ్యలో ఇరుక్కుపోయి మృతి చెందాడని పలు రకాలుగా ప్రయాణికులు చర్చించుకున్నారు. ఇంతేజార్‌గంజ్‌ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



ఘటనాస్థలిలో చరణ్‌ మృతదేహం

వడదెబ్బతో కూలీ మృతి



యాకయ్య మృతదేహం

మహబూబాబాద్‌ రూరల్‌: వడదెబ్బతో జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌ రావు కాలనీ చెందిన గాదెల యాకయ్య (42) గురువారం రాత్రి మృతి చెందాడు. యాకయ్య ఉదయం భవన నిర్మాణ పనికి కూలీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక స్నానం చేసేందుకు వెళ్తూ కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు యాకయ్య వడదెబ్బతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఉజ్వల సేవలందించిన లోకోషెడ్‌

- రైల్వే జీఎం ఎకె.జైన్‌
- కాజీపేట డీజిల్‌ షెడ్‌ గోల్డెన్‌ జూబ్లీ, షెడ్‌ సావనీర్‌ విడుదల
- ఆకట్టుకున్న కాయిన్‌, కరెన్సీ ఎగ్జిబిషన్‌



సావనీర్‌ను విడుదల చేస్తున్న జీఎం తదితరులు



బ్యాటరీ షెడ్‌ను ప్రారంభిస్తున్న జీఎం

కాజీపేట రూరల్‌: కాజీపేట డీజిల్‌ లోకో షెడ్‌ జాతికి ఉజ్వల సేవలందించి 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయమని దక్షిణ మధ్య రైల్వే జనరల్‌ మేనేజర్‌ అరుణ్‌కుమార్‌ జైన్‌ అన్నారు. డీజిల్‌ లోకో మోటివ్స్‌, ఎలక్ట్రిక్‌ లోకోస్‌ మొదలైన కొత్త సాంకేతికతలను ప్రవేశపెట్టడంలో కాజీపేట డీజిల్‌ షెడ్‌ ఎల్లప్పుడూ ముందంజలో ఉందన్నారు. కాజీపేట డీజిల్‌ కాలనీ రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం రాత్రి జరిగిన డీజిల్‌ లోకో షెడ్‌ గోల్డెన్‌ జూబ్లీ వేడుకలను రైల్వే జీఎం ఎ.కె.జైన్‌ జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలో కాజీపేట డీజిల్‌ లోకో షెడ్‌ 50 వసంతాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. షెడ్‌ మొదటి బ్యాచ్‌ అధికారులు, కార్మికులు రైల్వే అభివృద్ధికి, షెడ్‌ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారితో రైల్వేకు లాభం చేకూరిందన్నారు. మొదట 30 లోకోలతో చేపట్టిన నిర్వాహణ ప్రస్తుతం అందరి కృషితో 220 లోకోల నిర్వహణ స్థాయికి ఎదిగిందన్నారు. డీజిల్‌ లోకో షెడ్‌లో డీజిల్‌ ఇంజన్ల అవసరం తగ్గుతున్న దృష్ట్యా ఎలక్ట్రిక్‌ ఇంజన్ల నిర్వహణ చేపడుతున్నట్లు అందుకు తగినవిధంగా రైల్వే కార్మికులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఆర్థిక సంవత్సరానికిగాను రైల్వే విద్యుద్దీకరణ పనులు పూర్తి కానున్నట్లు తెలిపారు. కాజీపేట డీజిల్‌ లోకో షెడ్‌ నిర్వహణలో, అభివృద్ధిలో, కార్మికుల పనితనంలో ఎంతో పురోగతి సాధించిందని ఇందుకు జీఎం అభినందిస్తూ రూ.50 వేల నగదు పురస్కారాన్ని ప్రకటించారు. రైల్వే ప్రిన్స్‌పాల్‌ చీఫ్‌ ఇంజనీర్‌ పి.డి.మిశ్రా, డీఆర్‌ఎం ఎ.కె.గుప్తా మాట్లాడుతూ.. కాజీపేట డీజిల్‌ లోకో షెడ్‌కు దక్షిణ మధ్య రైల్వేలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గోల్డెన్‌ జూబ్లీ వేడుకల సందర్భంగా.. అధికారులు, కార్మికులను అభినందించారు. ఈసందర్భంగా షెడ్‌ సావనీర్‌ సంచికను విడుదల చేశారు. షెడ్‌ మొదటి బ్యాచ్‌ అధికారులను, రిటైర్డ్‌ అయిన కార్మికులను జీఎం చేత సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

పలు ప్రారంభోత్సవాలు

కాజీపేట డీజిల్‌ లోకో షెడ్‌లో ఏర్పాటు చేసిన బ్యాటరీ షెడ్‌, అండర్‌ ట్రక్‌ షెడ్‌, బ్యాలెన్స్‌ మిషన్‌ను రైల్వే జీఎం ఎ.కె.జైన్‌ ప్రారంభించారు. అనంతరం సెమినార్‌ హాల్‌లో రైల్వే అధికారులతో జీఎం సమావేశం నిర్వహించి మాట్లాడారు.

వావ్‌ కాయిన్స్‌..

గోల్డెన్‌ జూబ్లీ వేడుకల సందర్భంగా గుంతకల్‌ డీజిల్‌ లోకో షెడ్‌ రిటైర్డ్‌ సెక్షన్‌ ఇంజనీర్‌, న్యూమిస్మటిక్‌ సొసైటీ ఆఫ్‌ రాయలసీమ ఐ.ఎం.ఫెర్నాండెజ్‌ కరెన్సీ కాయిన్‌ అండ్‌ కరెన్సీ ఎగ్జిబిషన్‌ ఆకట్టుకుంది. రైల్వే జీఎం ఫెర్నాండెజ్‌ను అభినందించారు. రాత్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు రైల్వే అధికారులను ఆకట్టుకున్నాయి. డీజిల్‌షెడ్‌ సీనియర్‌ డీఎంఈ సందీప్‌కుమార్‌ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో సికింద్రాబాద్‌ రైల్వే అధికారులు ధర్మేందర్‌ కుమార్‌, తౌర్యా, నాగ్య, రాథోడ్‌, నవీన్‌, వెంకటరాజు, ఇతర విభాగాల అధికారులు, కాజీపేట డీజిల్‌షెడ్‌ అధికారులు హనుమానాయక్‌, భానుప్రకాశ్‌, రాజశేఖర్‌, రవీందర్‌, సూపర్‌వైజర్లు, రైల్వే మజ్దూర్‌ యూనియన్‌, రైల్వే ఎంప్లాయీస్‌ సంఘ్‌, ఎస్సీ ఎస్టీ, ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

కూతురు చెంతకు తల్లి



దేవమ్మను కూతురికి అప్పగిస్తున్న సఖి సెంటర్‌ నిర్వాహకులు

వరంగల్‌: సొంత గ్రామంనుంచి తప్పిపోయి వచ్చిన ఓ తల్లిని వరంగల్‌ సఖి కేంద్రం నిర్వాహకులు గురువారం ఆమె కూతురు వద్దకు చేర్చారు. నాలుగు నెలలుగా లేదనుకున్న అమ్మ ఇంటికి రావడంతో ఆ కూతురు ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సఖి సెంటర్‌ వారు తెలిపిన వివరాల ప్రకారం.. గీసుకొండ మండలం దుక్యా తండా గ్రామంలో గుర్తుతెలియని మహిళ నెల రోజులుగా ఉంటున్నదని, గ్రామస్తులు మహిళా హెల్ప్‌లైన్‌ ద్వారా ఈనెల 13న వరంగల్‌ సఖీ సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. సఖీ సెంటర్‌ రెస్క్యూ టీం మహిళను ఆధీనంలోకి తీసుకుని ఆశ్రయం కల్పించారు. ఆమెకు కౌన్సెలింగ్‌ ఇస్తూ వివరాలు సేకరించగా.. తన పేరు భీమడ్ల దేవమ్మ అని, భర్త చనిపోయాడని, ఒక కూతురు ఉందని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచుపల్లి గ్రామం అని తెలుసుకున్నారు. వెంటనే ఖమ్మం జిల్లా సఖి సెంటర్‌ వారితో కో-ఆర్డినేట్‌ చేసి ఆ మహిళ ఫొటోను, చెప్పిన వివరాలను షేర్‌ చేశారు. వారు సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్ల సహాయంతో దేవమ్మ కూతురు, అల్లుడిని గుర్తించారు. వారికి సమాచారం ఇవ్వగా దేవమ్మ అని నిర్ధారించుకున్నారు. ఈ నెల 19న అల్లుడు, కూతురు వరంగల్‌కు వచ్చి తీసుకెళ్లారని సఖి సెంటర్‌ అడ్మినిస్ట్రేటర్‌ వల్లె శ్రీలత, సిబ్బంది నూర్జహాన్‌, నిర్మలాదేవిలు తెలిపారు.

మేరు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ విడుదల

నయీంనగర్‌: తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర అడ్‌హక్‌ కమిటీ మెంబర్‌, ఉమ్మడి వరంగల్‌ జిల్లా కన్వీనర్‌ తాళ్ల సంపత్‌కుమార్‌ గురువారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈసందర్భంగా సంపత్‌కుమార్‌ మాట్లాడుతూ.. బై లా ప్రకారం ఎన్నికలు నిర్వహించడుతాయని, మేరు సంఘం ఎన్నికల్లో పాల్గొనేందుకు మేరు కులస్తులు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 16 వరకు గ్రామాలు, వార్డులు. మే 17 నుంచి జూన్‌ 16 వరకు పట్టణాలు, మండలాలు. జూన్‌ 17 నుంచి జూలై 16 వరకు జిల్లాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 18 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తారని, అడ్‌హక్‌ కమిటీ సభ్యులు కూడా పోటీ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లాల అడ్‌హక్‌ కమిటీ కన్వీనర్లు పెండ్యాల హరిప్రసాద్‌, కర్నె రవీందర్‌, గూడూరు బాలాజీ, గట్ల రమేశ్‌, కోటేశ్వర్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.